www.jananinadam.com

RNI NO:TGTEL/25/A0870

Follow:

# జననినాదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం

శుక్రవారం 18-09 - 2026

సంపుటి : 2 సంచిక :137

ఆసిఫాబాద్ Asifabad | హైదరాబాద్ Hyderabad | ఎడిటర్ : జాధవ్ రోహిదాష్ Editor: JADAV ROHIDAS

పేజీలు : 04

వెల: రూ.2.00

Simultaneously published from , Asifabad, Karimnagar, Adilabad , www.jananinadam.com



**జిల్లా వారిగా విలేకర్లు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ . అవినీతి పై సమరాన్ని సాగిస్తున్న **జననినాదం** తెలుగు దినపత్రికలో చేయుటకు అను భవం ఉన్న ఆసక్తి గత వారికి అవకాశం కలదు. అన్ని జిల్లా లు,డివిజన్లు, మున్సిపల్ మరియు మండలాల వారిగా విలేకరుల కావలేను,

సంప్రదించాల్సి నెంబర్

9550100197,9490111460




## చరిత్రను ఎవరూ దాచిపెట్టలేరు : రేవంత్ రెడ్డి పై కిషన్ రెడ్డి ఫైర్

**తెలంగాణ విమోచన దినోత్సవం వేడుకల్లో పాల్గొన్న కిషన్ రెడ్డి**

**రజాకార్ల ఘోరాలను గత పాలకులు తొక్కిపెట్టారని మండిపాటు**

**ఎంఐఎంకు అనుకూలంగా రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని విమర్శ**

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన 'తెలంగాణ విమోచన దినోత్సవం' వేడుకల్లో భారత ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

2వ పేజీలో...



## అభివృద్ధి అన్ని ప్రాంతాలకు చేరాలన్నదే

# ప్రజాప్రభుత్వ లక్ష్యం

**రైతుకు భరోసా ఉండాలి. మహిళలు ఆర్థికంగా ఎదగాలి**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్ 17:** రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అభివృద్ధి చేరడానికి నాలుగు కోట్ల ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందామని అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అభివృద్ధి అన్ని ప్రాంతాలకు చేరాలన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యంగా చెప్పారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా 4 కోట్ల తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి గారు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన యోధులకు ఈ చారిత్రక సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. "అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం మా ప్రజా పాలనకు

2వ పేజీలో...



## సేవా సంకల్ప్ అభియాన్కార్యక్రమం లోపాల్గొన్న సీఎం చంద్రబాబు

**వారణాసి 17:** వారణాసి-వాద్నగర్ సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. వారణాసిలోని రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు రాజ్ నాథ్ సింగ్, చిరాగ్ పాశ్వాన్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, బీజేపీ యూపీ అధ్యక్షుడు పంకజ్ చౌదరి హాజరయ్యారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల పాలనా ప్రస్థానంపై వారణాసి-వాద్నగర్ సేవా యాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా ఏపీ సీఎం చంద్రబాబు నిలిచారు. సీఎం చంద్రబాబు తన తండ్రి రామ్ విలాస్ పాశ్వాన్ కు అత్యంత సన్నిహితుడు, కష్టసుఖాల్లో తన తండ్రికి తోడుగా నిలిచారంటూ కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ గతాన్ని గుర్తు చేసుకున్నారు.




## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ పై నిప్పులు చెరిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**హైదరాబాద్ 17:** తెలంగాణ విమోచన చరిత్రను ప్రతి పౌరుడికి తెలియజేయాలనే ఉద్దేశంతోనే విమోచన దినోత్సవాలను నిర్వహిస్తున్నామని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సర్దార్ పటేల్ సంకల్పంవల్లే నిజాం నుండి తెలంగాణకు విమోచనం జరిగిందికొంతమంది కుహానా సెక్యులర్ వాదులు తెలంగాణలో రాజ్యమేలుతున్నారు. నిజాం పాలనలో హిందు దేవాలయాలపై దాడులు చేశారు. ఆడపిల్లలను నగ్నంగా బతకమ్మ ఆడించిన దుర్మార్గుడు నిజాం. ఎంతో మందిని చంపి రాక్షసంగా వ్యవహరించిన నీచులు రజాకార్లు. గత సీఎం కేసీఆర్, ఇప్పటి సీఎం

2వ పేజీలో...

## ఖైరతాబాద్ గణేషుడిని దర్శించుకున్న మాజీ మంత్రి హరీష్ రావు

**హైదరాబాద్17:** ఖైరతాబాద్ గణేష్ అంటే మన తెలంగాణలోనే కాదు, యావత్ ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన గణపతి ఉత్సవం. బడా గణేష్ అంటే ఖైరతాబాద్.. ఖైరతాబాద్ అంటే బడా గణేష్. బడా గణేష్ మాత్రమే కాదు.. బడియా గణేష్ కూడా. హైదరాబాద్ అంటే చార్మినార్, గోల్కొండ కోట ఎంత ప్రత్యేకమో.. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ను పెంచడంలో ఖైరతాబాద్ బడా గణేష్ కూడా అంతే ప్రత్యేకమైన భాగమని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. గురువారం అయన ఖైరతాబాద్ గణేషుడిని దర్శించుకున్నారు. హరీష్ రావు మాట్లాడుతూ ఈ బడా గణేష్ను దర్శించుకోవడానికి తెలంగాణ నుంచే కాకుండా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తున్నారు. ఇంతటి ఘనమైన సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులను మనస్ఫూర్తిగా



2వ పేజీలో....

## సెప్టెంబరు 17 చరిత్రకు మతం రంగు పులిమే ప్రయత్నం జరుగుతోంది: కవిత

2వ పేజీలో...

- సెప్టెంబర్ 17 సందర్భంగా జెండా ఆవిష్కరించిన కవిత
- తెలంగాణ పోరాట స్ఫూర్తిని గుర్తుచేసిన తెలంగాణ రక్షణ సేన అధినేత్రి
- కాంగ్రెస్, బీజేపీలపై కవిత విమర్శలు
- విలీన చరిత్రను వక్రీకరిస్తున్నాయని ఆరోపణ
- మతాలకు అతీతంగా ప్రజలు పోరాడారని వెల్లడి



**హైదరాబాద్17:** తెలంగాణ విలీన పోరాట యోధుల స్ఫూర్తితో రాష్ట్రంలో రాజ్యమేలుతున్న అరాచక శక్తులను గద్దె దించుతామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని బంజారాహిల్స్లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 తెలంగాణ పౌరుషానికి, పోరాట పటిమకు, త్యాగాల చరిత్రకు నిదర్శనమన్నారు. అయితే ఈ చారిత్రక రోజును కాంగ్రెస్, బీజేపీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరిస్తు

## తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్

**మహబూబాబాద్17:** మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 17-09-2026న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన అధికారిక వేడుకల్లో ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ ప్రాధాన్యతను స్మరించుకుంటూ నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ గారు పాల్గొని, ప్రజా పాలన, ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వ నిబద్ధతను ప్రస్తావించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో



కూడిన పాలన అందించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఆయన పేర్కొన్నారు. ఈ అధికారిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ గారు, జిల్లా ఎస్పీ శబరీష్ గారు, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా 'హైదరాబాద్ విమోచన దినోత్సవం' వేడుకలు

**హైద్రాబాద్ సెప్టెంబర్17:** ఆగస్టు 15న దేశానికి బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం వస్తే.. సెప్టెంబర్ 17న నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిందని, అందుకే తెలంగాణ ప్రజలకు ఆగస్టు 15 ఎంత ముఖ్యమైనదో సెప్టెంబర్ 17 కూడా అంతే పవిత్రమైన, చారిత్రాత్మకమైన రోజని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు , కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తో కలిసి జాతీయ పతాకాన్ని



## కేసీఆర్ ఫామ్ హౌస్ పై ప్రభుత్వ దృష్టి.. రంగంలోకి రెవెన్యూ అధికారులు

**కేసీఆర్ ఫామ్ హౌస్ భూములపై ప్రభుత్వం చర్యలు**

**సమీపంలోని ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారుల ఆరా**

**సర్వే నంబర్లు, పాత రికార్డుల సేకరణ**

**అసెంబ్లీలో సీఎం రేవంత్ ప్రకటనతో కదలిక**



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఫామ్ హౌస్ భూములపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ఫామస్కు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల సర్వే నంబర్లు, గతంలో ఆ భూములను సాగు చేసిన రైతుల పేర్లు, ప్రస్తుత భూ రికార్డుల వివరాలతో అధికారులు సమగ్ర నివేదికలను రూపొందిస్తున్నారు. కేసీఆర్ ఫామ్స్

## అభివృద్ధి అన్ని ప్రాంతాలకు చేరాలన్నదే
# ప్రజాప్రభుత్వ లక్ష్యం

మొదటిపేజీ తరువాయి...

పునాదులు. సెప్టెంబర్ 17వ తేదీ మన బాధ్యతను కూడా గుర్తు చేసే రోజు. ఈ చారిత్రక నేపథ్యం, ఉద్యమాల ఫలాలు ప్రజల జీవితాల్లో కనిపించాలి. రైతుకు భరోసా ఉండాలి. మహిళలు ఆర్థికంగా ఎదగాలి. అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలి. పేద బిడ్డకు మంచి చదువు, మంచి వైద్యం అందాలి. యువతకు ప్రపంచంతో పోటీ పడే అవకాశాలు రావాలి. తరతరాల అణిచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ. నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు పుట్టినిల్లు తెలంగాణ. అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల ఎప్పటికప్పుడు ప్రజా చైతన్యాన్ని రగిలించిందని అన్నారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాజ్యం అధికారికంగా భారతదేశంలో అంతర్భాగమైంది. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక సందర్భం. అందుకే సెప్టెంబర్ 17ను మనం "ప్రజా పాలన దినోత్సవం"గా జరుపుకుంటున్నాం. ప్రజా పాలన అంటే ప్రజల మాటకు విలువ ఇవ్వడం? వారి సమస్యలకు పరిష్కారం చూపడం. వారి హక్కులను కాపాడడం. ప్రభుత్వ వనరులు అందరికీ చేరేలా చూడడం. అదే స్ఫూర్తితో ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ ప్రజా పాలన కొనసాగిస్తున్నాం. తెలంగాణ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలతో కాదు, ప్రపంచంతో పోటీ పడుతోంది. రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4,18,931కు చేరింది. ఇది దేశ తలసరి ఆదాయం కన్నా దాదాపు 91 శాతం అధికం. అభివృద్ధి అంకెల్లో మాత్రమే కాకుండా ప్రజల జీవితాల్లో కనిపించాలన్నదే మా లక్ష్యం. ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాతి. ప్రతి రైతు కుటుంబం సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేశాం. రూ.20,616 కోట్లు విడుదల చేసి 25.35 లక్షల రైతు కుటుంబాలను అప్పుల ఊబి నుంచి బయటపడేశాం. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేశాం. సన్నాలకు క్వింటాల్కు రూ.500 బోనస్ చెల్లించామని అన్నారు.తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ సగర్వంగా జీవించాలి. ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగాలి. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో మా ప్రభుత్వం పనిచేస్తోంది. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. ఈ ప్రయాణాలతో మన ఆడబిడ్డలకు రూ.12,385 కోట్ల మేర ఖర్చు ఆదా అయింది. గృహజ్యోతి కింద 53 లక్షలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు



ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. 43 లక్షల కుటుంబాలకు రూ. 500కే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా 1 లక్ష 68 వేల మంది ఆడబిడ్డలకు రూ. 4,709 కోట్ల సహాయం చేశాం. 4.54 లక్షల స్వయం సహాయక సంఘాలకు రూ.60 వేల 487 కోట్ల బ్యాంకు లింకేజీ, రూ. 1,900 కోట్ల వడ్డీ రాయితీ కల్పించాం. మహిళా మార్టు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సులతో మహిళల ఆదాయం పెంచుతున్నాం. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 3.42 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నాం. 15 లక్షలకు పైగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశాం. 43 లక్షలకు పైగా మందికి సామాజిక భద్రతా పింఛన్లు అందిస్తున్నాం. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ల కింద సుమారు రూ. 31 వేల కోట్లు అందించాం. తాజాగా మరో 2.25 లక్షల మందికి పింఛన్లు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో నివసించాలనేది మా ప్రభుత్వ ఆశయం. ఇందిరమ్మ ఇళ్ల తొలి దశలో రూ. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. ఒక్కో ఇంటికి రూ. 5 లక్షలు అందించాం. రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. హైదరాబాద్ నగర పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ టవర్ల నిర్మాణాన్ని ప్రారంభించామని అన్నారు. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల ఆఫ్షోర్ క్యాంపస్లను హైదరాబాద్కు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. అమెరికాకు చెందిన నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీతో పాటు బ్రిటన్లోని 17 స్వతంత్ర విద్యా సంస్థల సమాఖ్య యూనివర్సిటీ ఆఫ్ లండన్ తమ ఆఫ్షోర్ క్యాంపస్ల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశాయి. ఆరోగ్య రంగానికీ అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5 లక్షల 19 వేల మందికి రూ.2,526 కోట్ల సహాయం అందించాం. సామాన్యుడికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో గోషామహల్లో రూ.2,700 కోట్లతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం మొదలైంది. సనత్నగర్లో మర్రి చెన్నారెడ్డి టిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించుకున్నాం. అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం. వరంగల్లో 2 వేల పడకలతో టిమ్స్ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొస్తాం. తెలంగాణ ఉద్యమంలో యువత ముందుండి పోరాడింది. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల కోసం పోరాడింది. 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను పారదర్శకంగా పూర్తి చేశాం. గ్రూప్-1 నుంచి గ్రూప్-4 వరకు పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాం. ఏఐతో ఉద్యోగాల స్వరూపం మారుతోంది. కొత్త నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది. అందుకే నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా అప్గ్రేడ్ చేసుకున్నాంమని అన్నారు. ప్రస్తుతం ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. విద్యుత్ డిమాండ్ కూడా పెరిగింది. తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తున్నాం. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజల నుంచి కూడా సహకారం ఆశిస్తున్నాం. వీబీ జీ రామ్ జీలో ఎక్కువ పని దినాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం'' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## కేసీఆర్ ఫామ్ హౌస్ పై ప్రభుత్వ దృష్టి
## .. రంగంలోకి రెవెన్యూ అధికారులు

మొదటిపేజీ తరువాయి...

భూములపై విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకటనకు అనుగుణంగానే అధికారులు ఇప్పుడు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంపై దృష్టి పెట్టారు. కేసీఆర్ భూముల విస్తీర్ణం, వాటి స్వరూపంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఖైరతాబాద్ గణేషుడిని దర్శించుకున్న మాజీ మంత్రి హరీష్ రావు

మొదటిపేజీ తరువాయి...

అభినందిస్తున్నాను. ఈ ఏడాది 69 అడుగుల పంచముఖ సంకట మహాగణపతిని ప్రతిష్ఠించడం విశేషం. అంతేకాదు, మట్టితో గణపతిని తయారు చేసి పూజించడం పర్యావరణ పరిరక్షణకు చక్కటి సందేశం. భక్తి శ్రద్ధలతో మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందామని అన్నారు. ఈ పంచముఖ సంకట మహాగణపతి, పంచముఖ హనుమంతుడు ప్రజలందరినీ దీవించాలని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా గణేష్ మండపాల నిర్వాహకులకు ఒక విజ్ఞప్తి. ఉత్సవాలు ఎంత ఘనంగా నిర్వహిస్తున్నామో.. నిమజ్జన కార్యక్రమాల్లో అంతే జాగ్రత్తలు తీసుకోవాలి. భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. నిన్న పటాన్చెరులో నిమజ్జనం సందర్భంగా జరిగిన అనుకోని ఘటన నన్ను తీవ్రంగా కలిచివేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిర్వాహకులు, అధికారులు సమన్వయంతో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలి. ప్రజలందరూ సురక్షితంగా, భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని కోరుకుంటున్నానని అన్నారు.

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్పై నిప్పులుచెరిగిన
## కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

మొదటిపేజీ తరువాయి...

రేవంత్ రెడ్డి మాత్రం తురకోళ్ల ఓట్ల కోసం నిజాంను పొగుడుతున్నారు.తెలంగాణ సమాజం వీళ్లను చూసి సిగ్గు పడుతోంది. వీళ్లకు డీఎన్ఏ టెస్ట్ చేయాలినిజాం పాలనా ఆక్రుత్యాలకు పరకాల, వీరబైరాన్ పల్లి, గుండ్రాంపల్లి, వెయ్యి ఊడల మర్రిలో పోరాడి అసువులు బాశారు. నిజాం దారుణాలకు బలైన వారికి ఏం సమాధానం చెబుతారుసర్దార్ పటేల్ ముందు నిజాం తలొంచితే..కేసీఆర్, రేవంత్ రెడ్డి మాత్రం నిజాంకు సాగిలపడుతున్నారు. తెలంగాణ విమోచన చరిత్రను మతం కోణంతో చూడటం సిగ్గు చేటుఈసారి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమే.. బీజేపీ అధికారంలోకి వస్తే తెలంగాణ విమోచన దినోత్సవాలను వారం రోజులపాటు నిర్వహిస్తాంగల్లీగల్లీలోనూ విమోచన దినోత్సవాలను అధికారికంగా నిర్వహిస్తాం.


## బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా
# 'హైదరాబాద్ విమోచన దినోత్సవం' వేడుకలు

మొదటిపేజీ తరువాయి...

ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ , శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) మల్క కొమరయ్య గారు, పార్టీ రాష్ట్ర ముఖ్య నేతలు, పదాధికారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజల చరిత్రలో అత్యంత పవిత్రమైన, చారిత్రాత్మకమైన రోజని కొనియాడారు. స్వాతంత్ర్యానంతరం సర్దార్ వల్లభ్భాయ్ పటేల్ 550కి పైగా సంస్థానాలను విలీనం చేసి అఖండ భారత నిర్మాణాన్ని పూర్తి చేశారని, ఆయన అకుంఠిత దీక్ష, తిరుగులేని నాయకత్వమే నేటి భారతదేశ ఐక్యతకు పునాది అని స్పష్టం చేశారు. నాటి హైదరాబాద్ సంస్థానంలోని ప్రజలు నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల అకృత్యాలకు వ్యతిరేకంగా ప్రాణాలర్పించి పోరాటం చేశారని గుర్తుచేశారు. హైదరాబాద్ను ఒక స్వతంత్ర దేశంగా ఉంచాలనే కుట్రతో నిజాం వ్యవహరించినప్పటికీ, ఉక్కుమనిషి సర్దార్ పటేల్ 'ఆపరేషన్ పోలో' ద్వారా సైనిక చర్య చేపట్టి హైదరాబాద్ సంస్థానాన్ని విముక్తి చేసి భారత యూనియన్లో విలీనం చేశారని, చివరకు నిజాం నవాబు సర్దార్ పటేల్ ముందు తలవంచి లొంగిపోక తప్పలేదని తెలిపారు. సెప్టెంబర్ 17ను 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'గా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ దశాబ్దాలుగా పోరాడుతోందని రాంచందర్ రావు స్పష్టం చేశారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సెప్టెంబర్ 17ను అధికారికంగా జరపాలని డిమాండ్ చేసిన కేసీఆర్, అధికారంలోకి వచ్చాక మజ్లిస్ (ఎంఐఎం) పార్టీకి భయపడి విమోచన దినోత్సవాన్ని పక్కనపెట్టారని విమర్శించారు. నిజాం పాలన కింద ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో ఈ చారిత్రక దినాన్ని ఎంతో ఘనంగా స్మరించుకుంటుంటే, తెలంగాణలో మాత్రం గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఓటు బ్యాంక్ రాజకీయాల కోసమే దీనిని విమోచన దినంగా నిర్వహించడానికి వెనకాడుతున్నాయని మండిపడ్డారు. బీజేపీ దశాబ్దాలుగా చేసిన పోరాటాలు, కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అధికారికంగా 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'గా నిర్వహించడం ప్రారంభించిన తర్వాతే... నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం దీనిని 'తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం' అని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం 'ప్రజా పాలన దినోత్సవం' అని పేర్లు మార్చి వేడుకలు జరుపుకోవాల్సిన పరిస్థితికి వచ్చారని ఎద్దేవా చేశారు. సెప్టెంబర్ 17ను 'హైదరాబాద్ విమోచన దినోత్సవం' అని పిలవడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్లకు ఎందుకు అంత భయమని ఆయన నిలదీశారు. ప్రజా పాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవానికి 'ప్రజా వంచన' ప్రభుత్వంగా మారిందని తీవ్రంగా దుయ్యబట్టారు. ఆగస్టు 15న దేశమంతటికీ బ్రిటీష్ పాలకుల నుంచి స్వాతంత్ర్యం లభిస్తే, సెప్టెంబర్ 17న నిజాం రాక్షస పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిందని, అందుకే తెలంగాణ బిడ్డలకు ఆగస్టు 15 ఎంత ప్రాముఖ్యమైనదో సెప్టెంబర్ 17 కూడా అంతే ముఖ్యమైన పండుగ రోజని పునరుద్ఘాటించారు. ఇదే శుభదినాన జన్మదినం జరుపుకుంటున్న గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ కి తెలంగాణ బీజేపీ తరపున, రాష్ట్ర ప్రజల తరపున ఆయన హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## సెప్టెంబరు 17 చరిత్రకు మతం రంగు
# పులిమే ప్రయత్నం జరుగుతోంది: కవిత


మొదటిపేజీ తరువాయి...



న్నాయని విమర్శించారు. తెలంగాణ విలీనానికి స్టేట్ కాంగ్రెస్ పోరాటమే కారణమని సీఎం చెబుతున్నారని, అది వాస్తవం కాదని కవిత అన్నారు. సంస్థానాల్లో పోరాటం చేయడం తమ విధానం కాదని అప్పట్లో మహాత్మా గాంధీ చెప్పిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. నిజాం ప్రభుత్వం పేదలకు ఇచ్చిన 10 లక్షల ఎకరాల భూమిని భారత యూనియన్ లో విలీనం తర్వాత కాంగ్రెస్ తిరిగి జమీందార్లకు అప్పగించిందని ఆరోపించారు. బీజేపీ తీరుపైనా కవిత మండిపడ్డారు. ముస్లిం రాజుపై హిందువులు చేసిన పోరాటంగా ఆనాటి చరిత్రకు మతం రంగు పులిమేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఆ పోరాటం జరిగిన సమయంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఉనికిలోనే లేవని అన్నారు. జాగీర్దార్లు, జమీందార్ల దాష్టీకాలకు వ్యతిరేకంగా మతాలకు అతీతంగా ప్రజలే స్వచ్ఛందంగా పోరాటం చేశారని కవిత తెలిపారు. వట్టికోట ఆళ్వార్ స్వామి, సురవరం ప్రతాపరెడ్డి, రావి నారాయణరెడ్డి వంటి వారు సైకిళ్లపై తిరుగుతూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని గుర్తుచేశారు. కాళోజీ, దాశరథి, షోయాబుల్లాఖాన్, మగ్దూం మొయినుద్దీన్ వంటి కవులు, రచయితలు తమ రచనలతో ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపారని చెప్పారు. వారి స్ఫూర్తితో దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగీ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి వంటి వారు పోరాటంలో ముందుకు వచ్చారని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో తెలంగాణ రక్షణ సేన కూడా కులమతాలకు అతీతంగా ప్రజల హక్కుల కోసం పోరాడుతుందని కవిత అన్నారు. రాష్ట్రంలో అరాచక పాలనకు అంతం పలికే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు..ఓటర్లజాబితా షెడ్యూల్ విడుదల

**పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్ విడుదల**
**మహబూబ్నగర్, వరంగల్ నియోజకవర్గాలకు ఎన్నికల ప్రక్రియ**
**సెప్టెంబర్ 20 నుంచి నవంబర్ 6 వరకు దరఖాస్తుల స్వీకరణ**
**పాత ఓటర్లు కూడా మళ్లీ కొత్తగా నమోదు చేసుకోవాలని స్పష్టం**
**డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటన**




తెలంగాణలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. మహబూబ్నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానాలకు ఓటర్ల నమోదు ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 20న ఓటర్ల నమోదుకు సంబంధించి పబ్లిక్ నోటీసు జారీ చేయనున్నారు. అప్పటి నుంచి నవంబర్ 6 వరకు అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతరం నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ఈ జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు గడువు ఉంటుంది. వీటిని పరిష్కరించిన అనంతరం, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఒక కీలక విషయాన్ని స్పష్టం చేశారు. గతంలో పట్టభద్రుల ఓటరుగా పేరు నమోదు చేసుకున్న వారు కూడా తప్పనిసరిగా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాత ఓటు రద్దవుతుందని, కొత్త జాబితాలో పేరు నమోదైతేనే ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందని వివరించారు. ప్రస్తుతం ఈ రెండు స్థానాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీలు వాణీదేవి, తీన్మార్ మల్లన్నల పదవీకాలం వచ్చే ఏడాది మార్చి నెలతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా రూపకల్పన ప్రక్రియను ప్రారంభించింది.

## 2004 అఫిడవిట్లో ఒక్క ఎకరం లేదు..
# కేసీఆర్ భూములపై పొంగులేటి సంచలన ప్రశ్నలు

**2004 అఫిడవిట్లో కేసీఆర్కు భూమి లేదన్న పొంగులేటి**
**ఇప్పుడు వేల కోట్ల విలువైన భూములు ఎలా వచ్చాయని ప్రశ్న**
**కేసీఆర్ భూస్వామ్య కుటుంబంలో పుట్టారన్న బీఆర్ఎస్ వాదనపై కౌంటర్**
**ఎన్నికల అఫిడవిట్లలో ఆస్తుల పెరుగుదల కనిపిస్తోందన్న మంత్రి**
**బీఆర్ఎస్ పాలనలో ఆస్తులు ఎలా పెరిగాయని నిలదీత**

హైదరాబాద్17: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భూముల వ్యవహారంపై మంత్రి పొంగులేటి శ్రీని వాస్ది మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 2004 కరీంనగర్ లోక్సభఎన్నికల అఫిడవిట్లో తనకు ఒక్క ఎకరం భూమి కూడా లేదని కేసీఆర్ పేర్కొన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు వేల కోట్ల విలువైన భూములు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల భూస్వామ్య కుటుంబంలో జన్మించారంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలకు ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు.కేసీఆర్ స్వయంగా సమర్పించిన ఎన్నికల అఫిడవిట్లను గతంలో ఎక్స్లో పంచుకున్న పొంగులేటి.. తెలంగాణ ఉద్యమ కాలంలో, ఆ తర్వాత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆయన ఆస్తులు భారీగా పెరిగాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్నికల అఫిడవిట్లే స్పష్టం చేస్తున్నాయని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు అప్పులు మిగిలితే.. కేసీఆర్ కుటుంబానికి మాత్రం లక్షల కోట్ల విలువైన ఆస్తులు ఎలా వచ్చాయని పొంగులేటి ప్రశ్నించారు.



ప్రభుత్వ భూములు, పేదలు, దళితులకు చెందిన అసైన్డ్ భూములను దోచుకోవడం వల్లే ఈ ఆస్తులు వచ్చాయా అని నిలదీశారు. అయితే ఇవన్నీ ఆరోపణలేనని, వాటిపై సంబంధిత ఆధారాలు లేదా అధికారిక నిర్ధారణను పొంగులేటి తన పోస్టులో వెల్లడించలేదు. ఉద్యమకారుల త్యాగాల పునాదులపై కల్వకుంట్ల కుటుంబం ఆస్తులు కూడబెట్టుకుందని పొంగులేటి ఆరోపించారు. కేసీఆర్ కు పుట్టుకతోనే వందల ఎకరాలు ఉన్నాయని కేటీఆర్ చెబుతున్నారని, మరి 2004 ఎన్నికల అఫిడవిట్లో ఆ వివరాలు ఎందుకు లేవని ప్రశ్నించారు. ఎన్నికల అఫిడవిట్లో తప్పులు రాశారా? లేక ప్రజలకు తప్పుడు సమాచారం చెబుతున్నారా అని కేటీఆర్ను పొంగులేటి నిలదీశారు.

జననినాదం
శుక్రవారం18 సెప్టెంబరు 2026

# సమాజ నిర్మాణంలో విశ్వకర్మల పాత్ర ఎంతో విశిష్టమైనది

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 18:** సమాజ నిర్మాణంలో విశ్వకర్మ పాత్ర ఎంతో విశిష్టమైనదని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి లతో కలిసి హాజరై విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారతీయ పురాణాలు, ఇతిహాసాలు, సంప్రదాయాలలో విశ్వకర్మను దైవ శిల్పిగా, నిర్మాణకర్తగా గౌరవిస్తారని తెలిపారు. అనేక దివ్య నిర్మాణాలు, ఆయుధాలు, నగరాలు, శిల్పాలను రూపొందించినవారిగా పురాణాలలో విశ్వకర్మ ప్రస్తావన ఉందని, భారతీయ శిల్పకళ, వాస్తుకళ, నిర్మాణ నైపుణ్యాల సంప్రదాయానికి ప్రతీకగా భావిస్తారని తెలిపారు. విశ్వకర్మ సమాజానికి చెందిన వృత్తిదారులు వడ్రంగి, కమ్మరి, స్వర్ణకారులు, కంచరి, శిల్పకళ తదితర సంప్రదాయ వృత్తులను కొనసాగిస్తూ సమాజానికి అవసరమైన వస్తువులు, పనిముట్లు, నిర్మాణాలు, కళాఖండాలను రూపొందిస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. నిర్మాణ రంగంతో పాటు వివిధ వృత్తులు, కళలు కాలానుగుణంగా ఎంతో అభివృద్ధి చెందాయని, నేటి తరం మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలని తెలిపారు. సంప్రదాయ కళలు, వృత్తులను పరిరక్షించడంతో పాటు కొత్త కళలు, నైపుణ్యాలను నేర్చుకోవడం ద్వారా యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు, పారిశ్రామిక శిక్షణ సంస్థలు వంటి సాంకేతిక, వృత్తి విద్యా సంస్థల ద్వారా అందిస్తున్న శిక్షణా అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.డి.సి.పి. మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో వివిధ వృత్తుల వారి సేవలు ఎంతో విలువైనవని తెలిపారు. సంప్రదాయ వృత్తులను కొనసాగిస్తూ సమాజానికి సేవలందిస్తున్న విశ్వకర్మ వృత్తిదారుల పాత్ర అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, విశ్వకర్మ సంఘాల ప్రతినిధులు, వృత్తిదారులు తదితరులు పాల్గొన్నారు.

# కులవృత్తులకు చేయూతనివ్వాలి

**విశ్వబ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు నూతి చంద్రమౌళి చారి**

**పెర్కపల్లిలో విశ్వకర్మ జయంతి వేడుకలు**



**జననినాదం,తిర్యాణి 17:** తరతరాలుగా సంప్రదాయ కులవృత్తులను నమ్ముకుని జీవిస్తున్న విశ్వబ్రాహ్మణ కుటుంబాలకు ప్రభుత్వం చేయూతనివ్వాలని విశ్వబ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు నూతి చంద్రమౌళి చారి అన్నారు. గురువారం పెర్కపల్లిలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ భగవానుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేసి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రమ, కళానైపుణ్యంతో మానవ నాగరికత అభివృద్ధికి విశ్వకర్మ భగవానుడు విశేషంగా దోహదపడ్డారని, సమస్త హస్తకళలు, వృత్తులకు ఆయన ఆదిదేవుడని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వృత్తిదారులకు అవసరమైన ఆధునిక పనిముట్లు, ఆర్థిక సహాయం, శిక్షణ అందించి వృత్తిదారులకు అండగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బైరోజు రాజశేఖర్ చారి, కనుకుల సురేష్ చారి, పోలాస రమేష్ చారి, కొత్తపల్లి రమేష్ చారి, దుమ్మటి సంతోష్ చారి, తర్మని అశోక్ చారి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి

**తిర్యాణి సర్పంచ్ మడావి రాజేష్**



**జననినాదం,తిర్యాణి 17:** ప్రజల భాగస్వామ్యంతో తిర్యాణి మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తామని సర్పంచ్ మడావి రాజేష్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం మండల కేంద్రంలో ప్రజా పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వ పథకాలతో అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరేలా కృషి చేయాలని, మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో ముందుకు సాగుతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నైతం రాంచందర్, బోల్లం వెంకన్న, కాంగ్రెస్ స్పోక్స్‌పర్సన్ కూన సురేష్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, కారోభరి సుద్దాల తిరుపతి, సీనియర్ నాయకుడు అంకం గౌరయ్య, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 20 గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక ఫోకస్

**తిర్యాణిలో సీవైడీఓతో ఒప్పందం**

**విద్య, వైద్యం, తాగునీటికి ప్రాధాన్యం**

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**జననినాదం,తిర్యాణి 17:** ఆకాంక్షిత మండలమైన తిర్యాణిలో ఎంపిక చేసిన 20 గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు సీవైడీఓ సంస్థతో ఒప్పందం కుదిరిందని కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మట్‌తో కలిసి సీవైడీఓ ప్రతినిధులతో ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా కార్యక్రమాలను అమలు చేస్తామని, స్థానిక అవసరాలను గుర్తించి విద్య, వైద్యం, తాగునీరు, సాగునీరు, పోషకాహారం వంటి కీలక రంగాల్లో అభివృద్ధి పనులు చేపడతామని, ప్రతి గ్రామానికి దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. విద్యా ప్రమాణాలను పెంచడం, ఆరోగ్య సేవలను బలోపేతం చేయడం, సురక్షిత తాగునీరు అందించడం, సాగునీటి వసతులను మెరుగుపరచడం, పోషకాహార స్థాయిని పెంచడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రజలకు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీవైడీఓ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రవీణ్ జాదవ్, జాయింట్ డైరెక్టర్ డా. నాగేశ్వర్, ప్రాజెక్ట్ మేనేజర్ సాయి నితీష్, నీతి ఆయోగ్ కో–ఆర్డినేటర్ డా. బాలరాజు రాజారాం తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం

**మందగూడ సర్పంచ్ తుంరం గోపాల్**

**చింతల మాదరలో స్కూల్ బ్యాగులను పంపిణీ**



**జననినాదం,తిర్యాణి 17:** విద్యార్థుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మందగూడ సర్పంచ్ తుంరం గోపాల్ అన్నారు. గురువారం గ్రామపంచాయతీ పరిధిలోని చింతల మాదరలో పేద విద్యార్థులకు ప్రభుత్వం అందించిన స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన వస్తువులను ప్రభుత్వం అందించడం సంతోషకరమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్‌గౌడ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, గ్రామపటేల్ ఆత్రం గణేష్, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్, తదితరులు పాల్గొన్నారు.

# పరిజ్ఞానం లేని రోజుల్లో గొప్ప శిల్పి విశ్వకర్మ: మండలి ఉపాధ్యక్షుడు బండ ప్రకాష్



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 18:** సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందని రోజుల్లోనే గొప్ప నిర్మాణాలు చేసిన శిల్పి విశ్వకర్మ అని మండలి ఉపాధ్యక్షుడు బండ ప్రకాష్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆ శాఖ జిల్లా అధికారి అబ్దుల్ నదీమ్ అధ్యక్షతన నిర్వహించిన విశ్వకర్మ జయంతి వేడుకలకు జిల్లా కలెక్టర్ హరిత, జిల్లా పోలీసు అధికారి నీతికా పంత్, స్థానిక శాసనసభ్యురాలు కోవా లక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అనిల్ కుమార్, పురపాలక అధ్యక్షుడు ఆకాష్ తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్ప వ్యక్తులను నిత్యం స్మరించుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందని రోజుల్లో గొప్ప నిర్మాణాలు చేయడం విశ్వకర్మకే దక్కిందన్నారు. అటువంటి గొప్ప వ్యక్తులు నేటి సాంకేతిక యుగంలో కూడా ఆదర్శప్రాయులని కొనియాడారు. కష్టపడేతత్వానికి, సృజనాత్మకతకు, సాంకేతిక పరిజ్ఞానానికి ప్రతీక విశ్వకర్మ అని అన్నారు. భారత నిర్మాణ శాస్త్రమైన వాస్తు శాస్త్రాన్ని అందించింది ఆయనేనని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏక గవాక్ష చైర్మన్ అలీ బిన్ అహ్మద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు మంగ, కౌన్సిలర్ వెంకన్న, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీమంతుల వేణుగోపాల్, తూమోజు సురేష్ చారి, భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

# పత్తి చేనులో గంజాయి మొక్కలు



**జననినాదం,సిర్పూర్(యు) 17:** మండలంలోని బండేఏయర్ గ్రామ శివారు పత్తి చేనులో ఐదు గంజాయి మొక్కలను గుర్తించినట్లు ఎస్ఐ కొమురయ్య తెలిపారు. గ్రామానికి చెందిన దడేంజ గుణవంత్ రావు తండ్రి అర్జున్‌కు చెందిన పత్తి చేనులో గంజాయి మొక్కలు ఉన్నట్లు సమాచారం అందడంతో తనిఖీ చేయగా ఐదు మొక్కలు లభించాయని, వాటి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని తెలిపారు. మొక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొమురయ్య తెలిపారు. గంజాయి సాగు, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ ఐ హెచ్చరించారు.



# జిల్లాలో జ్ఞాన భారతం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 18:** జిల్లాలో జ్ఞాన భారతం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జ్ఞాన భారతం సంబంధిత జిల్లాస్థాయి కో-ఆర్డినేషన్ కమిటీ అధికారులు, విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జ్ఞాన భారతం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పురాతన గ్రంథాలు, తాళపత్ర గ్రంథాలు, అరుదైన మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి భద్రపరచే ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని, జిల్లాలోని వివిధ ప్రాంతాలలో, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రంథాలయాలు, విద్యా సంస్థలు, దేవాలయాలు, మఠాలు, పరిశోధనా సంస్థలు, వ్యక్తుల వద్ద అందుబాటులో ఉన్న పురాతన గ్రంథాలు, తాళపత్ర గ్రంథాలు, చారిత్రక ప్రాధాన్యత కలిగిన మాన్యుస్క్రిప్ట్‌లను సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో గుర్తించి భద్రపరిచే కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. ప్రజల వద్ద ఉన్న అరుదైన గ్రంథాలు, పాత పత్రాలు, తాళపత్ర గ్రంథాల సమాచారాన్ని అధికారులకు అందించాలని తెలిపారు. మన సంస్కృతి, సాంప్రదాయాలు, నాగరికత సంబంధిత గ్రంథాలు, ఇన్స్క్రిప్షన్స్ , శిలా శాసనాలు సంబంధిత పత్రాలు ఎవరి దగ్గరైనా ఉన్నట్లయితే జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నందు సమర్పించాలని తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో సంబంధిత కళాశాలల విద్యార్థులకు జ్ఞాన భారతం కార్యక్రమం సంబంధించి అవగాహన కల్పించి, జిల్లాలోని మారుమూల ప్రాంతాల సంబంధిత గ్రంథాలు ఏమైనా ఉన్నట్లయితే వారి ద్వారా సేకరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని పురాతన దేవాలయాలు, మసీదులు, చర్చిలలో అందుబాటులో ఉన్న ప్రాచీన గ్రంథాలను కుల, మత, వర్గ భేదాలకతీతంగా సమాచారాన్ని అందించాలని, సంబంధిత పత్రాలను డిజిటలైజేషన్ చేసి భద్రపరచడం జరుగుతుందని, తద్వారా జిల్లా చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, సంప్రదాయాలు, స్థానిక వారసత్వానికి సంబంధించిన విలువైన సమాచారాన్ని భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచడమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా భారతదేశ గొప్పతనాన్ని చాటేందుకు జ్ఞాన భారతి కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. గుర్తించిన మాన్యుస్క్రిప్ట్‌లను శాస్త్రీయ పద్ధతులలో డిజిటలైజేషన్ చేసి, వాటి సమాచారాన్ని రక్షించడం జరుగుతుందని, ప్రభుత్వం నిర్దేశించిన విధంగా కేంద్రీకృత ప్రదేశంలో భద్రపరిచి, కేంద్రీకృత డిజిటల్ డేటాబేస్‌లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్ఞాన భారతం జిల్లా స్థాయి కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు, జిల్లా పౌర సంబంధాల అధికారి యం.కృష్ణమూర్తి, జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ అధికారి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి అంజయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




గిరిజన రచయితలు మరియు రచయిత్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు...గిరిజన సాహిత్య రచనలు, రచయితల వివరాలు సేకరిస్తున్నాను. మీకు తెలిసిన, మీ దగ్గర ఉన్న రచనల, రచయితల సమాచారాన్ని ఈ క్రింది వాట్సాప్ నంబర్ కు పంపించవలసిందిగా విజ్ఞప్తి!

ఆచార్య భూక్య తిరుపతి
9441335123
తెలుగు శాఖ
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్. హైదరాబాద్.500046

# పాఠ్యాంశాలతో పాటు జీవిత నైపుణ్యాలూ అలవర్చుకోవాలి

- ఆర్థిక వ్యవహారాల్లో అప్రమత్తంగా ఉండాలి
- ఆర్బీఐ ఏజీఎం, ఎండీఓ రాములు
- మావలలో ఘనంగా ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు
- ఆర్బీఐ, ఎస్బీఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు దిశానిర్దేశం



**జననినాదం,ఆదిలాబాద్ 17:** విద్యార్థులు పాఠ్యాంశాలతోపాటు జీవిత నైపుణ్యాలను అలవర్చుకోవాలని ఆర్బీఐ ఏజీఎం, ఎండీఓ రాములు అన్నారు. మావల మండల కేంద్రంలోని విద్యార్థి బీఈడీ కళాశాలలో గురువారం ఆర్బీఐ, ఎస్బీఐ, మావల ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి విద్యాసంస్థల సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యతతో యువత భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఆర్థిక ప్రణాళిక రూపొందించుకోవచ్చన్నారు. ఉన్నత విద్యకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా బ్యాంకుల ద్వారా విద్యా రుణాలు పొందవచ్చని తెలిపారు. బ్యాంకింగ్ సేవలపై ఫిర్యాదులుంటే ఆర్బీఐ అంబుడ్స్‌మన్ టోల్‌ఫ్రీ నంబర్ 14448ను సంప్రదించవచ్చన్నారు. అనంతరం ఎల్‌డీఎం ఉత్పల్‌కుమార్ ధాం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి ఉండటంతోపాటు కేవైసీ పూర్తి చేసుకుని ఖాతాలను క్రమం తప్పకుండా వినియోగించాలని, సంపాదనను ప్రణాళికాబద్ధంగా వినియోగించడం, పొదుపు చేయడం అలవర్చుకోవాలన్నారు. డిజిటల్ లావాదేవీల్లో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత వివరాలను ఇతరులతో పంచుకోవద్దన్నారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. నిష్క్రియ ఖాతాల్లోని సొమ్మును అర్హత ఉన్న ఖాతాదారులు బ్యాంకు లేదా ఉద్గమ్ పోర్టల్ ద్వారా పొందవచ్చన్నారు. ఎస్బీఐ శివాజీచౌక్ బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ ఉట్నూర్ ఆర్‌సెట్టి ద్వారా స్వయం ఉపాధి శిక్షణ అందిస్తున్నామని, యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. సిఎఫ్ఎల్ కౌన్సిలర్ కమలాకర్ బడ్జెట్, పొదుపు, సామాజిక భద్రతా పథకాలు, అటల్ పెన్షన్ యోజన, బీమా పథకాలు, సుకన్య సమృద్ధి యోజన, ఎన్‌పీఎస్ వాత్సల్య తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన గ్రూప్ గేమ్స్, సేవింగ్ యాక్టివిటీస్ విద్యార్థులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్బీఐ సిబ్బంది సురేందర్, పాపయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నరేందర్, నాగరాజు, సిఎఫ్ఎల్ సిబ్బంది భూమన్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే పార్టీకి బలం

**గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి**

**టీఆర్ఎస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి వేణు యాదవ్**




**జననినాదం,ఆదిలాబాద్ 17:** కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి వేణు యాదవ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టైలర్స్ కాలనీలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, బోథ్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తే పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయవచ్చన్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవాలని, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. పార్టీ కార్యక్రమాలను గ్రామగ్రామాన విస్తరించి ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని, కార్యకర్తలకు నాయకత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం రాథోడ్ బాపురావును వేణు యాదవ్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రాథోడ్ బాపురావు సైతం వేణు యాదవ్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో చేరిన మంగి వార్డు సభ్యుడు



**జననినాదం, తిర్యాణి 17:** మంగి గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు మర్సుకోల మధుకర్ గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ జడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్ పార్టీ కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మధుకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మాట తప్పిందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయని పార్టీలో కొనసాగడం ఇష్టం లేకే బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సర్పంచ్ చిక్రం కృష్ణ, మాజీ సర్పంచ్ ఎస్.శంకర్, మాజీ ఉపసర్పంచ్ బుజ్జిరావు, మంగి మాజీ ఎంపీటీసీ అమృత్‌రావు, నాయకులు రేగొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# తిర్యాణికి మరో గుర్తింపు

**మార్కెట్ డైరెక్టర్ నైతం రాంచందర్**

**జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా కొమురయ్య**



**జననినాదం,తిర్యాణి 17:** కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పులి కొమురయ్య నియమితులు కావడం తిర్యాణి మండలానికి దక్కిన గుర్తింపుగా మార్కెట్ డైరెక్టర్ నైతం రాంచందర్ పేర్కొన్నారు. శుక్రవారం తన నివాసంలో కొమురయ్యను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి చెందిన నాయకుడికి జిల్లా స్థాయిలో బాధ్యతలు అప్పగించడం సంతోషకరమన్నారు. పార్టీపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను కొమురయ్య సమర్థంగా నిర్వర్తించాలని ఆకాంక్షించారు. ఎస్సీ వర్గాల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని, పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయిలో విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు అట్టడుగు వర్గాలకు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొట్నాక గణపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దె విజయ్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జుగ్నాక మారుతి, స్పోక్స్‌పర్సన్ కూన సురేష్, ఉపాధ్యక్షుడు ఆత్రం లక్ష్మణ్, తలండి సర్పంచ్ నైతం మంగు, మంగి ఉపసర్పంచ్ కనక శ్రీకాంత్, మడావి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు లిస్టులో తప్పులుంటే సరిచేసుకోండి

**తహసీల్దార్ శ్రీనివాస్**



**జననినాదం,తిర్యాణి 17:** ఓటరు లిస్టులో పేరు, ఇతర వివరాల్లో తప్పులుంటే వెంటనే సరిచేసుకోండని తిర్యాణి తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో చెక్ చేసుకోవాలని కోరారు. గురువారం మండలంలోని గిన్నెధరి, గడలపల్లి గ్రామపంచాయతీల పరిధిలో ఓటరు జాబితా సవరణలో భాగంగా హియరింగ్ నిర్వహించారు. గిన్నెధరి పీఎస్ నం.187లో 36 మంది నో మ్యాపింగ్, 70 మంది అనమలైస్‌గా ఉన్నారు. గడలపల్లి పీఎస్ నం.189లో నలుగురు నో మ్యాపింగ్, 170 మంది అనమలైస్‌గా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ, బీఎల్‌వోలు, సర్పంచులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 18:** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని మందమర్రి మండలం రామకృష్ణాపూర్ ప్రాంతంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, సింగరేణి డిస్పెన్సరీని మండల తహసిల్దార్ సతీష్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణలతో కలిసి సందర్శించి ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం నూతన ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటుకు అనువైన స్థలం కోసం సింగరేణి సంస్థకు చెందిన స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం కమిషనరేట్‌లో ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

**కమిషనరేట్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన పోలీస్ కమిషనర్**





**జననినాదం,గోదావరిఖని17:** రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కి అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ కమిషనర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, కమిషనరేట్ కార్యాలయ భవనం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. అధికారులు, సిబ్బందితో కలిసి జాతీయ గీతంతో పాటు రాష్ట్ర గీతం లి"జయ జయహే తెలంగాణ"లిను ఆలపించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అధికారులు, సిబ్బందికి ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజలందరికీ ఎంతో ప్రాముఖ్యత కలిగిన చారిత్రక దినమని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం తెలంగాణ ప్రాంతం ప్రజాపాలనలోకి వచ్చిన సెప్టెంబర్ 17వ తేదీకి చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు. ఇదే రోజున అప్పటి నిజాం పాలన నుంచి తెలంగాణ ప్రాంతం భారత యూనియన్‌లో విలీనమై, సమగ్ర భారతదేశంలో అంతర్భాగంగా మారిందన్నారు. ఈ చారిత్రక పరిణామం కోసం నాడు ఎన్నో త్యాగాలు, బలిదానాలు చేసిన వారందరినీ ఈ సందర్భంగా గౌరవంగా స్మరించుకోవాలని తెలిపారు. వారి త్యాగాలను ఎల్లప్పుడూ గుర్తు చేసుకుంటూ దేశ సమగ్రత, ఐక్యతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ శాంతి, సౌభ్రాతృత్వం, అభివృద్ధి కోసం ఐక్యంగా పనిచేసేలా ప్రోత్సహించాలని సూచించారు.

పోలీస్ శాఖ తరపున ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, వారికి భద్రత, సౌకర్యాలు కల్పించడం, శాంతిభద్రతలను మరింత పటిష్టంగా పరిరక్షించడం తమ ప్రధాన బాధ్యత అని పోలీస్ కమిషనర్ తెలిపారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి భద్రత, సంక్షేమం కోసం పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తోందన్నారు. సెప్టెంబర్ 17 సందర్భంగా ఈ స్ఫూర్తిని మరోసారి గుర్తుచేసుకుని, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషిని మరింత సమర్థవంతంగా కొనసాగించాలని తెలిపారు. రామగుండం కమిషనరేట్ పరిధిలోని ప్రజలకు ఉత్తమమైన పోలీస్ సేవలు అందిస్తూ, శాంతిభద్రతలను సమర్థవంతంగా పరిరక్షిస్తూ, రాష్ట్ర అభివృద్ధికి తమ వంతు సహకారం అందించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె.శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీసీఎస్ ఏసీపీలు రవీందర్, ప్రవీణ్ కుమార్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు, ఏవో శ్రీనివాస్, ఆర్ఐలు మల్లేశం, దామోదర్, రమేష్, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాద్ రావు, రామగుండం సీఐ కృష్ణ కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, వివిధ విభాగాల ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సీపీఓ సిబ్బంది, వివిధ విభాగాల సిబ్బంది, ఏఆర్ సిబ్బంది, ప్రత్యేక బృందాల సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఘనంగా జాతీయ పతాకావిష్కరణ

**నగర డిప్యూటీ మేయర్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యాదగిరి సునీల్ రావు**



కరీంనగర్ సెప్టెంబర్ 17: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని నగర డిప్యూటీ మేయర్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యాదగిరి సునీల్ రావు డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సునీల్ రావు మాట్లాడుతూ, అమరవీరుల త్యాగాల వల్లే తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిందన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చొరవతో చేపట్టిన 'ఆపరేషన్ పోలో' ద్వారా తెలంగాణ నిజాం పాలన నుంచి విముక్తి పొంది భారత సమాఖ్యలో విలీనమైందని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను ఎల్లప్పుడూ స్మరించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కాలనీ వాసులు, కార్యాలయ సిబ్బంది మనోహర్ రావు, అశోక్ రెడ్డి, హనుమయ్య, శ్రీనివాసరావు, శేఖర్, బాలు, హమీద్, మణిదీప్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

**ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**కరీంనగర్ సెప్టెంబర్ 17:** వ్యాధుల బారిన పడకుండా.. ప్రతి ఒక్కరూ పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల పోస్టర్ ను మంత్రి.. కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ (రెవిన్యూ) శ్రీనివాసరెడ్డి, నగరపాలిక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డిఓ షర్మిల, డీఆర్డీఓ గీత తదితర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. శుభ్రతకు పెద్దపీట వేస్తూ.. ప్లాస్టిక్ నిర్మూలన, చెత్త చెదారం తొలగింపునకు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. పట్టణాలు, గ్రామాలు శుభ్రంగా ఉంటేనే దేశం అభివృద్ధి బాటలో నడుస్తుందని పేర్కొన్నారు.

Printed, Published and Ownedby **JADAV ROHIDAS,** and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293.**Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197,9490111460